# నెరుపు వయసు

'సచ్చి యాడుండాడో, పెద్ద బతుకు బతికిపొయ్యాడు. మొదులు ఆయినే వుంటే తనకు కొరవేం వుంటదీ. ఎందుకూ తంబాలకు మల్లే ముగ్గురు కొడుకులుండారు. చరే, యిద్దరికి పెల్లి అవనే అయింది గందా. అయి, ఆ మొగరాయిళ్ళు గెజ్జలగుర్రాల సేత, తన్ను ఎంత లెక్కకుబడ్తే అంత లెక్కకు అన్రాని యన్నీ అనిపిత్తుండారు గందా. మరి ఈ సిన్నోడి కేం పుండు పుట్టిందంటా? పెల్లి అవనోడూ అవనట్టుండక్కర్లా? కనపడ్డ ఆడగూతుర్నల్లా అట్టా సూత్తా ఎనికిడ్తే పోల్చిందేనా? చరే పుట్టిందే అనుకో. నే అమ్మను గందా! పెద్దోళిద్దరూ పెల్లాల్సేతుల్లో సిక్కి తన్ను గవిరిదేవికిమల్లే ఆడిత్తుంటే, యింకా పెల్లాం మొగం యెట్టుంటదో తెలవని ఈడికే యిట్టుంటే, యిగ తన వూసోరికి పద్తుండట్టూ? ఈడ మొగోడే లేనట్టు వుండ ఆడగూతుర్ని కాత్తా ఏడామడ ఏటాతలగాని ముడి బిగియకపోతిరి. రత్తమ్మ కూతురు వరమ్మకు యాడో ఏటా తల ముడి! హుఁ! వూల్లో ఆరంతా ముక్కుమీన ఏ లేసుకోలా. ఎందు కేసు కోరంటా? అదేవంత వుండ చంబందవఁ నీ? ఎంత కలిసొత్తా ఒల్లు ఒంచుకుంటుంటే మెటుకు అసలాడ ఎనకేం వుండక్కర్లా? యిదిగో నాలుగెకరాలు, అదిగో మావిఁడితోట. కాదూ, ఓ పువాకు యాపారం, ఓ నేతియాపారం, అచలు అయ్యేం లేందెట్టనంటా? పదెకరాలు మకతాకు తీసుకుండాడే అనుకో. సివరికి గెడ్డీ, మా ఒత్తే జనపకట్టే, యియ్యేగదంటా మిగిలేదీ! ఒకేల నాలుగ్గింజలు మిగులుంటే మొటుకు తనూ, ఇద్దరు అప్పలూ, పెల్లాం, పిల్లోడూ, ఈరంతా సమచ్చరం పొడుగూనా బతికుండాల్చిందే నంటావా? పిల్లోడు బుద్ధిగలోడూ, పుటగ్గలోడూ, కట్టబడి ఎనకేసుకుండే లచ్చనాలుండై. ఐతేమెటుకు ఆ మిగతాజనవూఁ, ఆ పదావఁడ ఏటాతల చంగతేందంటా? తను పెద్దదైపోతుండే. కూతుర్ని సూడాలని బెమెత్తితే ఎట్టా! అదీ పిల్లోడూ ఈడేడో దెగ్గిర్నుంటే తను యింకెన్ని సెక్కిరాలూ ముంతకజ్జాయాలు తీసికెల్లదూ! అది కాపరాని కెల్లినాక తను మూడు చార్లేగా ఆడకెల్లింది. ఏటా ఓపాలేగా. తొల్సూరి పురుటిగ్గూడా ఈడకు పంపియకపోతిరి. ఎంతన్నాయం! అబ్బ, ఆ బండి మీన బడి ఈ బండి మీన బడి, నడిసినంత లెక్క నడిసి, కడాకు దరికి సేరుకుండేతలికి మిసినీపిండి బట్టినట్టు ఒల్లంతా ఆ లెక్కనయిపోయి, ఎల్లిన పద్దినాలూ పడకేత్తే, మరసనాడు మల్లీపయానవేఁగా! పెద్దోడేం సేత్తుండాడో, ఆడి పెల్లాం ఏవంటుండదో? సిన్నోడేం

సేత్తుండాడో, ఓవురెనికిడ్తే ఎల్తుండాడో, ఏకాడికీ వుత్త బెవేఁ గాని, నా మొగం యీడేం పీక్కదిందావఁనో! పానీ యింకో రెన్నాలు ఆడే వుందావంటే, దానాడ బిడ్డలు సెరో రోకలి దీసుక ఆణ్ణించి ఎల్లేదాకా తెగబొడవరూ! ఎల్లొత్తానంటే, 'అఁ ఎల్లొద్దు మరీ' అంటా గుడ్లు దిప్పుతా ఎల్లేదాకా సూత్తా ఆడే నిలబడ్తారు. పిల్లోడి పేరు చుబ్బరామయ్యంట. చుబ్బరామయ్యేందీ గొబ్బిరికాయకు మల్లే! మరి ఆడ పెత్తనవంతా ఆళ్ళిద్దర్దేగా. దీని కచలు నోరుంటేగా! ఎట్ట కాపరం సేత్తుండదో ఏవోఁ! సక్కంగ ఎన్నముంతకు మల్లేవుంటాడు పిల్లోడు, నిగనిగలాడ్తా. ఆళ్ళ పోలికే. అయ్యో దేవుడా! మరి చుబ్బరామయ్యంటే అనుకోల్చిం దేం వుంటదీ. సక్కగా లచ్మిన్నారాయణ పెడ్తే యీల్లదేం-పోయిందో! సిన్న ఎదవ! గుమ్మటావుఁకుమల్లే వుంటాడు ముద్దొత్తా. మూట యిప్పి, సెక్కిరాలూ, ముంత కజ్జాయం, పొప్పుండలూ, సెరుగ్గడలూ, బయటపెట్టే తలికి, పడ్తా లేత్తా వచ్చి ముక్కునా నోట్నా ఒల్లంతా పాకంబోసుక ఏఁవెగి రెగిరిపడ్డాడు ముద్దుపచ్చి! వరమ్మ ఏం మురుసుకుందది! ఆదెవుర్రా అనంటంటే, ముంత కజ్జాయం సీకుతా, 'అమ్మా మ్మా-మ్మా' అనంటా తఫాకుని ఒళ్లో ఒచ్చి పడ్డాడు సిన్నముండ! ఏం సేత్తుండాడో నాయిన! మాట లొచ్చుంటయి బాగా ఏం ఒచ్చుంటే ఏం లాబం! ఆ మేనత్తముండలు కాత్తా ఆళ్ళపక్కీన తరిబీదు సెయికుండుంటారూ యీ పాలికీ? మొదులీ వరమ్మకు నోరుంటేనా! కొత్తపండగ దెగ్గిర కొచ్చింది. ముద్దుపచ్చికి ముంతకజ్జాయం, సెక్కిరాలూ, చిలుకు చొక్కాయా, గెజ్జలసంచి యెత్తికెల్తా. ఈ పాలన్నా వరమ్మకు నేతసీరా, రెయకా యెత్తికెల్లాలి. మొదులు యీ యెంకాయమ్మ డబ్బిత్తేగా యియన్నీ అయ్యేదీ? యెటనో యెనకేసు కుండది కాత్తా ముంగలగా దీనికి అప్పిచ్చి కూకుంటినేంది? అయియ్యకుంటే! బజార్లో నిల్డీసి దీనెవరావేందో అంతుదేలవనూ. ఏదెట్టుండా యీ సెయిబాద నన్ను యీడి కన్నా కదల్నిత్తేనా? బానే వుండది పండగముంగల ఒంటిసేత్తో. వుండుండి ఒచ్చుద్దేం యీ మంట పడి సావా! అయితే మొటుకు వరమ్మకాడికి పయానం కట్టకుండా యీడ కూకుంటా నెట్టా-హు!' అంటా రేత్తిరి బువ్వల్దిన్నాక ఒంటిగా మంచమ్మీన యిశారబడ్తా కూకుండ రత్తమ్మకాడికి సిన్నకొడుకు నాగబూసి ఒచ్చి సూర్లూ, గూళ్ళూ దేవులాట్టం మొదలెట్టాడు.

"ఉప్పుడేందిరా గూళ్లెదుకుతుండావూ?"

"ఓ బేడ్డబ్బులు కావాలే!"

"అఁ. యీడేం కుప్పేసు క్కూకోలా సన్నాసిముండలకల్లా దారబోయిను! సాల్లే అయన్నీ కెలకమాక-"

"ఏందమ్మా నూ వుప్పుడందీ?"

"ఏందా-సన్నాసి గూతుర్లంతా సేర్తే చరి-"

"ఓడా యదవా."

"యిగ నీకు పిల్లనీమంటే ఓడిత్తాద్రా? అచలేఁవిటికిలే యీ పురానవంతా! పెద్దోళ్ళిద్దరూ ఎలగబెడ్తుండారు సాల్దూ!"

"వుప్పుడు పెల్లి ఓడు కావాలంటుండాదే? అదే ఒచ్చుద్ది ఎతుక్కుంటా! ఓ బేద్దబ్బు లిద్దూ తెల్లార్తే పనుండదీ?"

"తెల్లార్తే పనుంటవేందీ, రేత్తిరి బేద్దబ్బులు కావల్చి రాటవేందీ! ఏందిరా నీ యవారం-అచ లేవిఁటికి లే-నాకడ లేవు పో."

"ఆఁ, వుంటయిలే తెద్దూ?"

"పోయి అన్న నడుగు."

"ఆఁ, ఓపక్క యియ్యాలో రేపో పిల్లో పిల్లోడో పుట్టబోతుంటే, ఆడు మొటుకు కరుజున పట్టంలా! వుంటయిలే తెద్దూ?"

"యీ మా తల్లికి పురుడొత్తుండది గావాఁల్ను. యిగ యాడబడ్తే ఆడనే దేనికీ దిట్టిబొమ్మాలే! కిందటి కొత్త పండక్కి గావాల్ను, వరమ్మనూ పిల్లోణ్నీ సూసింది. ఎల్లి యీపాలన్నా దాన్నీడకు తెత్తే బాగుండు, కొన్నాలు వుండిపోద్ది."

"యాడికే నూ వుప్పు డెల్లేదీ? అన్న ఏవఁనుకుంటాడూ? యీడ ఎవరూ లేరన్నట్టు యాడో దూరానుండ కూతురో అంటావేందీ, రేత్తిరేల ఎప్పుడు సూసినా?"

"అదంటే చరి లబ లబ బాదుకుంటారు! యీళ్ళ సొమ్మేం దిన్నదనో"

"నూ సేరత్తుండది సాలక యిగ మేంగూడా దేనికీ-"

"యిది గిందుగ్గాదూ యీడ ఓచనం వుండ నంటుండదీ? యిగ పయానం గట్టక యీడ కూకుంటాగా-"

"యిదిగో? ఓ బేద్దబ్బులు నే అడిగుంటాననేగా నూ ఆవజాన బాగోతం యిప్పుతుండదీ? నే నేవోఁ తెల్లార్తే నికరంగా జనపనార దీసి సెన్నాకోలా కడ్దావఁని నిన్ను బేద్దబ్బు లడిగానా, నువ్వేమో అయ్యన్నీ ఆ ఏటాతల పారబో సొత్తా నంటండావా, యిగ నే నీడ దేనికీ? పోతుండా."

యిదిగిదీ వరస. పిడకాబొడకా సేరేత్తా ఏవిఁటికైనా నాలుగురాళ్ళు దాసుకుంటే చరి, జోరీగ కరుసుకుండట్టొచ్చి కరుసుకుంటారు. పానీ ఓ కొడుకులంటా కోడళ్లంటా యీ పెద్దదాంతో ఓ పక్కీన పోతుంటే, తనగ్గావాల్చింది మటుకు ఏ వుంటదీ? యాడో దూరానుండదానికి పెడ్తుండానని ఏడుత్తా రేం దంటా! ఏడాదికో పాలన్నా ఆడగూతురికి కూసిని ఏమన్నా ఎత్తికెల్లక్కర్లా? ఏం, ఎందుకెత్తి కెల్లనూ?..... పండక్కి ఒత్తానని రంగయ్య

సేత రాపించిన జాబు సేరి, ఒచ్చుద్దనుకుంటా వుంటారు గావcల్ను. ఇంతలో దీనికి పురుడేం ఒచ్చుద్దిలే. వుండకేం సేసుద్ది కొన్నాలూ! ఈలోన తిరిగి ఎట్టనో ఒత్తానాయెనూ. ఏదెట్టుండా ఈ సెయితో సా వొచ్చిందేందంటా! యాడకో వుండుండి గుంజుద్దేం? కాత్తె మూటాముల్లె వుంటది, యట్టనబ్బా దూర ప్పయానం? ముద్దు ఎదవ ఎట్టుండాడో! ఈపాలి ముంతకజ్జాయవంతా ఆడే తింటాడు... అబ్బ ఏం పీకుద్దీ సెయ్యి... వుcవు-బగమంతడా...

* * *

"పెద్దదానివి నూ యీడ లేకుంటే ఎట్ట జరుగుద్దే!" అన్నాడు పెద్దోడు మూటబట్టుకుంటా.

వూc, తనిప్పుడు కావా ల్సొచ్చిందేం? యిన్నాలూ ఆళ్లు తనమీన వంటలు గిరవాటు పెడ్తుంటే యాడ కా నొచ్చిందో ఈ పెద్దదీ- అదిగో గుమ్మం కాడ తొంగిసూత్తా ఎట్టా మెటికెలిరుత్తుండారో తనకెల్లి! యిగ దేనికి ఈడా- "వుcహుc, నేపోవాల్చిందే!" అంటా మూటెత్తుకుంది తను.

పెద్దోడు సిన్నోడికల్లి సూశాడు. సిన్నోడు ఓ మూల సెన్నాకోల కర్ర మీనకు ఆచ్చేసుడికిమల్లే వాలుండాడు, గాబుకాడ నెవcరేత్తుండ బర్రెకల్లి సూత్తా. గబాల్న ఆ నెవుcరుడు వుచ్ని గుటకేసి, రెండుకల్లూ సూటిగా తనకేసి తిప్పి, మోరపైకెత్తి సూసింది బర్రె, రెప్ప కదల్నీకుండా... రవిలుబండి కొండ మీన్నుంచి పడదోసినట్టు లగెత్తుతా వుంది... తణక తణక దన్ దన్, తణక తణక దన్ దన్, తణక తణక... ఎత్తి రాతారిబోట్లో పడేసి గొలుసులు దెంచుక లగెత్తి కెల్లింది రవిలుబండి, దూకుడు మీనుండ గండుసీమకు మల్లే మలుపులు తిరుక్కుంటా. మూటేదీ - అయ్యో ముంతకజ్జాయ మ్మూటేదీ-వుc -ఓ-య్యో-లబ లబలా వ్వావ్వా-అబ్బ యిదేం పయానc వమ్మీ-యింకెంతలెక్క నడవాలో పాడుపీడా-అబ్బో యిదేం సెయిరో బగమంతడా-యింకా నయం మూట యింటికాడ పెట్టొచ్చా. వున్నేనికి మూటతో యీడ కూరుకుబోతే యిన్ని మంచీలుబోసె పేపతుండదు-యీకాల్లు రెండూ గానుగలు లాగుతుండ య్యేందీ... అబ్బ, ఇంకెంత లెక్కా-ఓ ఏవూరయ్యోవ్ బండీ? ఓ నిన్నే నయ్యోవ్-నూ పాపయవేనా నాయినా! కిందటిచారీ నీబండేగా వున్నేనికీ-ఆc యిగ పా. పాపయ్యా మా వరమ్మ ఎట్టుండదీ-చుబ్బరామయ్య ముతకజ్జాయవం టుండాడా- ముద్దుపచ్చి-అయ్యో నా మొగంసావా! యింతలెక్కా ఒత్తా మూట యింటో మరిసిపొయ్యానేందీ-ఆ ఆడబిడ్డలిద్దరూ రోకలిపొన్నులు సూపియరు కందా... వరమ్మ ఏ వంటదో-నాయిన, పిల్లోడు ముంతకజ్జాయవంటా నా ఒల్లంతా పీకడూ...నే మెటుకేం జేయనూ, ఒంటిరెక్క పచ్చినైపోతే-ఆళ్ళకే తెలుసుద్దిగా...ఏవోcలే పిల్లనూ పిల్లోణ్ణీ సూత్తే అంతేసాలు...యిదుగో వాకిట్లోకొచ్చి నిలబడ్డారూ-అదేందీ

అట్టసూత్తారు తనకల్లీ...ఆc ఆc, కాత్తె బండి నిలుపు నాయినా-యిదేందీ? బండి దిగలేక పోతుండదేం తనూ. బలే తమాశే-సేతులూ కాల్లూ యాడయి ఆడ చీలలు బిగుచ్చుండయ్యేందీ?

ముంగల ఆడబిడ్డలు ఒచ్చి తన్నూ, బండంతా ఎగాదిగా సూసి ఎనక్కు తగ్గారు - మూటకోసం గావల్ను... పిల్లోడు పైకీ కిందికీ ఎగబాకుతుంటే వరమ్మ ఒచ్చి బండిదెగ్గిర నిలబడ్డది-'దిగ వేందే ఆటనే కూకుండావూ-అబ్బ యిదేం పిల్లోడమ్మా కేతిగాడికిమల్లే-' అంత పెద్ద దయిందేం వరమ్మ నోరూ - "రావేం దిగీ, దెయ్యంపట్టినోళ్ళకుమల్లే సూత్తా" యాడా-తను కదల్లేదేం-అచలిదేంది- "గుజ్జూముంతా, బల్లం-" అంటా గబాల్న బండిలోనకు జొరబడి, అటిటూ సూసి బావ్ మన్నాడు చుబ్బరామయ్య-తన్ను సెరో కాలు పట్టుక గబాల్న కిందికి లాగి రాత్తా మీన పడేశారు ఆళ్ళిద్దరూ - 'యీc ముంతా గుజ్జూ-ముంతా' అంటా అమ్మ సంకలో సేరి తనకల్లి ఏలుబెట్టి సూపిత్తా, పెద్దగా అరుత్తా ఏడుత్తుండాడు చుబ్బరామయ్య- "నువేంది వుండరా - యీశారీనియవేందీ-" అంటుండది వరమ్మ - టావ్ టావ్ మనిపించారు రెండు రోకళ్ళూ, ఇద్దు రాడబిడ్డలు ఆళ్ల సేతుల్లో అయివుండట్టు ముంగల తన కవుపీలేదే-పోటుసాగింది-రోకళ్లు ఎగిరెగిరి పద్తుండయి- 'యీc గుజ్జూ ముంతా-' ఏలు అటనే తనకల్లి సూపిత్తా పిండి మరపద్తుండాడు చుబ్బరామయ్య-ఆ పిండిమర ఆపను తనకు చీలుబిగిసినై - రెండు గాదు నాలుగు రోకళ్ళు, తన మీనగా ఆద్తుండయి - ఆళ్లంతా తన సుట్టూ యెగుర్తుండారు, ఒక్కొక పువ్వో గౌణితమ్మా, అంటా పాడ్తా... ...

"ఓ అమ్మోవ్, ఓ అమ్మోవ్ లెగవ్వే లెగవ్వే, అన్నకు పిల్లోడు పుట్టాడూ-దబ్బున్రాయే నే యెల్లి యెల్లుల్లిపాయలు తీసక రావాలా" అంటా సెన్నా కోలకర్ర జారి కిందపడ్డా యెనక్కి తిరిగి సూడకుండా లగెత్తికెల్లాడు నాగబూసి.

ఒంటిసేత్తో యెగిరి కూకుని, లెగిసి పురుడు గదికి కాళ్ళు గుంజుకుండది రత్తమ్మ, లచ్చిన్నారాయణ, లచ్చిన్నారాయణ అనుకుంటా.